పేస్కేలు వర్తింపచేస్తామని ప్రకటించడం పట్ల హర్షం

- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఉపాధి హామీ సిబ్బంది

నవతెలంగాణ-కామారెడ్డి

ఉపాధిహామీలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతన స్కేల్ వర్తింపచేస్తునట్లు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి అనసూయ ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఉపాధి హామీ సిబ్బంది ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధి హామీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పంచాయతీరాజ్ శాఖామాత్యులు పే స్కేల్ వర్తింపచేస్తున్నట్లు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయన్న నేతృత్వంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసి పేస్కేల్ వర్తింపచేస్తునందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, పంచాయత్‌రాజ్ శాఖామంత్రి సీతక్క, ఇతర శాఖల మంత్రులకు, ఉపాధి హామీ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

శనివారం | ఫిబ్రవరి 03, 2024 | www.navatelangana.com

ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతం నుండి రాత్రి సమయంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న పుల్కల్ గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను బండరెంజల్ గ్రామం వద్ద పట్టుకొని బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ మురళి తెలిపారు. గత కొన్ని రోజులుగా రాత్రి సమయంలో పుల్కల్ గ్రామానికి చెందిన కొన్ని ట్రాక్టర్లు ఇసుక రవాణా చేస్తూ గ్రామ శివారులో ఇసుక డంపులు వేసి లారీల ద్వారా రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. చర్యలు నిమిత్తం పట్టుకున్న ట్రాక్టర్ల సమాచారం పై అధికారులకు సమాచారం అందించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

బీజేపీ నాయకుడు కిషన్‌రావు ఆగడాలను అరికట్టాలి

- గ్రామపంచాయతీకి చెందిన స్థలాన్ని గ్రామస్తులకు అప్పజెప్పాలి
- పెద్దఎత్తున చిన్నపొతంగల్ గ్రామస్తుల రాస్తారోకో
- అధికారుల హామీతో విరమణ
- రోడ్డుకిరువైపులా భారీగా నిలిచిన వాహనాలు



రాస్తారోకోలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-గాంధారి

బీజేపీ నాయకుడు కిషన్‌రావు ఆగడాలను అరికట్టాలని, గ్రామపంచాయతీకి చెందిన స్థలాన్ని గ్రామస్తులకు అప్పజెప్పాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చిన్నపొతంగల్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీకి చెందిన 14 గుంటల భూమిని గ్రామానికి చెందిన బీజేపీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోతంగల్ కిషన్‌రావు అనే వ్యక్తి అక్రమంగా భూమి పట్టా చేయించుకున్నారని ఆరోపిస్తూ చిన్న పోతంగల్ గ్రామస్తులు సుమారు 500 మంది వరకు కామారెడ్డి బాన్సువాడ ప్రధాన రహదారిపై రెండు గంటలపాటు శుక్రవారం పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు. అధికారులు న్యాయం చేసే వరకు రాస్తారోకో విరమించబోమని బీష్మించు కూర్చున్నారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పోలీసులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆర్ఐ రమేష్ వచ్చి న్యాయం చేస్తామని చెప్పడంతో రాస్తారోకోను విరమించి తహసీల్దార్ కార్యాలయానికి తరలివెళ్లి తహసీల్దార్ జానాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. పోతంగల్ కిషన్ రావు గ్రామంలో గ్రామ పంచాయతీ స్థలమే కాకుండా వేరే ఇతర స్థలాలు కూడా అనేకంగా ఆక్రమించాడని ఆరోపించారు. 1987లో గ్రామంలోని గ్రామస్తులందరూ డబ్బులు జమచేసి 200 ఎ సర్వేనెంబర్‌లో ఏడు గుంటలు, 200 బి సర్వేనెంబర్‌లో ఏడు గుంటలు కొనుగోలు చేశారని అలాగే అక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మించామని కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో గ్రామ పంచాయతీ నిర్మిస్తామని తలపెట్టడంతో ఈ స్థలం నాది అని నా పేరుపై పట్టా ఉందని కిషన్ రావు ప్రతి విషయానికి అడ్డుపడుతున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామస్తులు గ్రామపంచాయతీ నిర్మాణాన్ని స్లాబ్ లెవెల్ వరకు నిర్మించినా.. బిజెపి నాయకుడు కిషన్ రావు ప్రతి విషయంలో అడ్డుపడుతున్నాడని ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

'డబుల్' ఇండ్లల్లో ప్రవేశం

- ప్రభుత్వం నిర్మించి పంపిణీ చేయకపోవడంతో ప్రవేశం చేసిన పలువురు
- స్వాధీనం చేసుకున్న వారిని ఖాళీ చేయించిన పోలీసులు
- గదులకు తాళం వేసిన రెవెన్యూ అధికారులు



డబుల్ ఇండ్లకు తాళం వేస్తున్న అధికారి

నవతెలంగాణ-భిక్కనూర్

గత రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని ఉద్దేశంతో ప్రతి గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించిన విషయం తెలిసిందే. నిర్మాణం పూర్తయిన తర్వాత అర్హులను గుర్తించి డబుల్ బెడ్రూంలు అందజేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లను పంపిణీ చేయకపోవడంతో విసుగు చెందిన మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు డబుల్ బెడ్ రూమ్ ఇంటిని రాత్రికి రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎవరికివారు వారికి నచ్చిన గదిని తీసుకొని వంట సామాగ్రితో సహా గదులలో ఏర్పాటు చేసుకొని గుమ్మానికి మామిడి తోరణాలు కట్టుకొని పాలు పొంగించుకున్నారు. విషయం తెలుసుకున్న బస్వాపూర్, సిద్దరామేశ్వరనగర్ గ్రామస్తులు తమరికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కావాలని వెళ్లి చూసేసరికి నచ్చిన వారు నచ్చిన గదికి తాళం వేసి ఉన్న దాన్ని చూసి అవాక్కై శుక్రవారం పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు రెవెన్యూ అధికారులు డబుల్ బెడ్ రూమ్‌లను ఖాళీ చేసి వెళ్లిపోవాలని, ఖాళీ చేయకుంటే కేసులు నమోదు చేసి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఇండ్లను స్వాధీనం చేసుకున్న పలువురు గదులను ఖాళీ చేసి తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. అనంతరం ఎమ్మార్వో శివప్రసాద్ మాట్లాడుతూ అర్హులను గుర్తించి ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే డబుల్ బెడ్ రూమ్‌ల పంపిణీ చేస్తామని, అంతవరకు గ్రామస్తులు సహనంతో ఉండాలని, గొడవలకు అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సహకరించాలని తెలిపారు.

ప్రతి గ్రూప్ 'ఏ గ్రేడ్'లో ఉండాలి

- ఏపీఎం



మాట్లాడుతున్న ఏపీఎం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అన్ని డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషిచేసి ప్రతి గ్రూపు ఏ గ్రేడ్‌లో ఉంచే విధంగా చూడాలని ఏపీఎం రాజారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల విఓఏల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ..

మండలంలోని ప్రతి సంఘం నిర్ణీత తేదీ ప్రకారం సమావేశం ఏర్పాటు చేసుకొని సమావేశంలోనే అన్ని రకాల లావాదేవీలు జరపాలన్నారు. కార్యక్రమంలో సీసీలు రాములు, అంజయ్య, లింగం, నరేందర్‌రెడ్డి, కృష్ణ అంజలీ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఉపకారణాలు, వాహనాలు పంపిణీ



వాహనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా వికలాంగులకు ఉపక రణాలను, వాహనాలను, ఆర్థిక తోడ్పాటుకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి బావయ్య, దోమకొండ ప్రాజెక్టు సిడిపిఓ రోచిష్మ, ఫీల్డ్ రేంజ్ ఆఫీసర్ నరేష్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ..

కామారెడ్డి పట్టణం, మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్ల పుట్టిందని ఎవరూ బాధపడకూడదని ఆడపిల్ల మహాలక్ష్మితో సమానం అన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడమంటే రిజర్వేషన్లను వ్యతిరేకించడమే

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడమంటే రిజర్వేషన్లను వ్యతిరేకించడమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ అన్నారు. కామారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆర్.అండ్.బి అతిథి గృహంలో జిల్లా ఇంచార్జి బైరపోగు శివకుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ హాజరై మాట్లాడుతూ.. సమాజంలో అణచివేతకు గురైన దళిత వర్గాలకు చేయూతనివ్వడం కోసం రిజర్వేషన్ల కల్పించబడ్డాయని, అలా రిజర్వేషన్లు కల్పించడం వల్ల సమాజంలో చీలిక తీసుకువచ్చినట్లు కాదని అన్నారు. రిజర్వేషన్ల కల్పన వెనుక ఎంతటి సామాజిక స్ఫూర్తి ఉన్నదో ఎస్సీ వర్గీకరణ వెనుక కూడా అంతే సామాజిక స్ఫూర్తి ఉందని అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడమంటే ఎస్సీ రిజర్వేషన్లను వ్యతిరేకించడం అవుతుందని స్పష్టం చేశారు. కొంత మంది ఎస్సీ వర్గీకరణతో దళితుల మధ్య చీలిక వస్తుందని దుష్ప్రచారం చేస్తూ అడ్డుకోవడానికి కుట్రలు చేస్తుండడం సరికాదని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో మాదిగలకు ఉప కులాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చట్టబద్దత కోసం వేగంగా చర్యలు చేపట్టాలని కోరారు. అందుకోసం క్షేత్రస్థాయిలో నూతన గ్రామ మండల కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి భైరపోగు శివకుమార్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పద్మరావు, ఎంఎంఎస్ సీనియర్ నాయకులు లక్ష్మి బాలరాజు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సాయి, ఉపాధ్యక్షులు విజయ్ యాదగిరి శంకర్, సుమలత, లలిత, లత, యాదన్న, స్వామి, రాజు, కుంటి లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాకోరా సొసైటీ చైర్మన్‌పై నేడు అవిశ్వాస తీర్మానం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోరా సొసైటీ చైర్మన్ కృష్ణరెడ్డిపై తొమ్మిది మంది సభ్యులు అవిశ్వాసం తెలిపారు. సొసైటీలో మొత్తం 13 మంది సభ్యులు ఉన్నారు. అందులో నలుగురు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కాగా.. 9 మంది బీఆర్ఎస్ పార్టీ సభ్యులు ఉన్నారు. చైర్మన్ పదవిని కృష్ణరెడ్డి కైవసం చేసుకున్నారు. మరో సంవత్సరం పాటు పదవీ ఉండగా కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం 9 మంది సభ్యులు మద్దతు ఇవ్వడంతో సిద్దాపూర్ సర్పంచ్ భర్త దశరథ్ మరో 8 మంది కాంగ్రెస్ పార్టీ నుంచి దశరథ్‌ను చైర్మన్‌గా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా పాత చైర్మన్‌పై అవిశ్వాసం వ్యక్తం చేశారు.

ఎవరికి మద్దతు పలుకుతారో..

నేడు సొసైటీ సభ్యులు సమావేశంలో పాల్గొని చైర్మన్ పదవిని ఎవరికి ఇవ్వబోతారనేది చర్చనీయంగా మారింది. సమావేశంలో అవిశ్వాసం నెగ్గేందుకు చేతులు ఎత్తిపిస్తారా? ఓటు వేయిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

పోలీసు బందోబస్తు కోరిన డీసీఓ..

పలు పార్టీలకు చెందిన సభ్యులు పోటాపోటీగా ఉండటంతో పాటు రాజకీయ జోక్యం కూడా ఎక్కువగా ఉండటంతో డీసీఓ పోలీసు బందోబస్తును కోరినట్టు సమాచారం. గతంలో లోపాలపై చర్చలు జరిపితే పార్టీల వ్యక్తుల, సభ్యుల మధ్య గొడవలకు దారితీసే అవకాశం ఉండటంతో ఆయన పోలీసు బందోబస్తు కోరినట్టు సమాచారం.

16న గ్రామీణ బంద్

- సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
- సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ మోతీరాం నాయక్



మాట్లాడుతున్న మోతీరాం నాయక్

నవతెలంగాణ-గాంధారి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్ సమ్మెను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ మోతీరం నాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామినాథ కమిటీ సిఫారసు ప్రకారంగా రైతు పెట్టుబడికి మరో 50 శాతం కలిపి మద్దతు ధర గ్యారెంటీ చేసి చట్టం చేయాలన్నారు. అర్హులైన వాళ్ళందరికీ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ భూమి సాగులో ఉన్న వాళ్ళందరికీ ఆ పట్టా పాసుబుక్కులు మంజూరు చేయాలని, దొరల దగ్గర ఉన్న ప్రభుత్వ భూములను ప్రతి పేదవాడికి పంచాలని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి ప్రతి కార్మికులకు 26 వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో 16 రకాల నిత్యావసర వస్తువులు పరచాలని అన్నారు. అందరికీ గృహవసతి కల్పించాలని గుడిసెలు వేసుకున్న వారికి ఇల్లు కట్టించాలని తెలిపారు. గిరిజన దళితులు మైనార్టీలపై జరుగుతున్న దాడులు ఆపాలని అన్నారు. సద్మల్ మైనింగ్‌లో పోయిన భూములను భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాతుసంగెం శివారులో 119, 170 సర్వే నెంబర్లు ఉన్న ప్రభుత్వ భూములు చాలామందికి పోడు భూములకు పట్టాలు రాలేదని, పోడు భూమి సాధనలో ఉన్న వాళ్లందరికీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 16న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు కమ్మరి సాయిలు, కిషన్ రావు, ప్రకాష్, రాములు, సాయిలు, బి.హరిచంద్, చందర్‌నాయక్ వందల మంది రైతులు, కూలీలు, కార్మికులు పాల్గొన్నారు.

ఓటు వేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఓటు వేసే విధానంపై ఓటర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ.వి.ఎం. ప్రదర్శన కేంద్రాన్ని (డెమో) సందర్శించి బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వి.వి. ప్యాట్‌ల పనితీరును పరిశీలించి యంత్రాల నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఈ.వి.ఎం. యంత్రాల ద్వారా దేశంలో ఎన్నికలు సజావుగా నిర్వహిస్తూ కొన్ని గంటలలో ఫలితాలు వెల్లడిస్తున్న దని అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలలో ఓటర్లు తడబాటుకు గురికాకుండా ఈ.వి.ఎంలను యంత్రాల ద్వారా ఓటు వేయుటపై అవగాహన పెంపొందించుటకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో డెమో ప్రదర్శిస్తున్నామని అన్నారు. మొబైల్ వాహనం ద్వారా డెమో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటర్లు కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ అంటే ఏమిటో తెలుసుకోవాలని, అదేవిధంగా ఓటు వేసినట్లు వి.వి.ప్యాట్‌ల ద్వారా ఎలా తెలుసుకోవచ్చో అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో స్వీప్ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఓటరు నమోదు, మార్పులు, చేర్పులతో పాటు ఈ.వి.ఎం. మిషన్ల ద్వారా ఎలా ఓటు వేయాలో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ ప్రవీణ్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు అనిల్‌కుమార్, ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు విత్తనాలు విక్రయించే డీలర్లు వ్యవసాయ రంగంపై అవగాహన కలిగి ఉండాలి..

రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించే డీలర్లు వ్యవసాయ రంగంపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే రైతులకు నాణ్యమైన మేలురకం వాటిని అందించవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మనిషి అనారోగ్యానికి గురైతే డాక్టర్ ఎలా అవసరమో రైతన్నల వ్యవసాయానికి మీరు అంతటివారని, అన్నం పెట్టే రైతన్నలను మోసం చేయవద్దని హితవు పలికారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో జాతీయ వ్యవసాయ విస్తరణ నిర్వహణ సంస్థ వారు ఎల్లారెడ్డి డివిజన్‌లోని 40 మంది విత్తన, పురుగు మందులు, ఎరువుల విక్రయించే ఇన్‌పుట్ డీలర్లకు 48 వారాల పాటు నిర్వహించిన వ్యవసాయ విస్తరణ సేవ (డిఎ ఈఎస్ఐ) డిప్లొమా కోర్సులో ఉతీర్ణులైన వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు అమ్మే విక్రయదారులు వ్యవసాయ రంగంపై అవగాహన కలిగి ఉన్నప్పుడే రైతులకు సరైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడంతో పాటు మెలకు వలు తెలుపగలుగుతారని అన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన మన జిల్లాలో రైతులకు లాభసాటి వ్యవసాయంగా శాస్త్ర, సాంకేతిక పద్ధతులు అవలంబిం చుటపై అవగాహన కలిగించాలని అన్నారు. సంపాదించడానికి ఎన్నో అవకాశాలున్నాయని, విక్రయాలు పెంచాలనే ఉద్దేశ్యంతో రైతులను మోసగించవద్దని కోరారు. వివిధ రకాల పంటలు పండించుట, లేబర్‌ను అధిగమించుటకు డ్రోన్ వంటి టెక్నాలజీ వినియోగించుట, పంటలకు రోగాలు వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించాలన్నారు. ఈ నెలలో ఎల్లారెడ్డి డివిజన్‌లో మిగిలిన విక్రయదారులతో పాటు బాన్సువాడ, బిచ్కుంద డివిజన్‌లో 40 మంది చొప్పున డిప్లొమా కోర్సులో శిక్షణ ఇవ్వనున్నామని, ఇట్టి కోర్సులకు హాజరు కావలసినదిగా కలెక్టర్ కోరారు. అనంతరం బంగారు, వెండి, రజత పతకాలు సాధించిన రవీందర్‌రెడ్డి, సంతోష్, సాయిచరణ్‌ను శాలువాలతో సన్మానించి పతకం, జ్ఞాపిక, సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. డిప్లొమా కోర్సులో ఉతీర్ణులైన మిగతా వారికి జ్ఞాపిక, సర్టిఫికెట్‌లను జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మితో కలిసి అందజేశారు. అలాగే ఫెసిలిటేటర్ రామచంద్ర రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రత్న భారతి, లక్ష్మీప్రసన్న, సునీత రాణి, హరీష్ కుమార్, శ్రీకాంత్, అనిల్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సంపూర్ణ ఆరోగ్య సేవలు అందాలి

- డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శిరీష



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

నవతెలంగాణ-నసురుల్లాబాద్

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవలను వైద్య సిబ్బంది ప్రజలకు అందించాలని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శిరీష ఆదేశించారు. శుక్రవారం బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్ మండలం నెమ్లి వెల్‌నెస్ సెంటర్‌లో ఆరోగ్య కార్యకర్తలకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు మండల డివిజన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో చాలా మార్పులు వచ్చాయని అందుకు అనుగుణంగా ప్రతి ఆరోగ్య కార్యకర్త పని చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతంలోని ఆయా గ్రామాల ఆరోగ్య ఉప కేంద్రాల్లో గాను, అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీ స్త్రీల నమోదు కార్యక్రమం, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరీక్షలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు అయ్యేలా చూడడం, మహిళలకు కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించి కుటుంబ నియంత్రణ జరిగేలా చూడాలన్నారు. అలాగే పిల్లలకు సంపూర్ణ టీకాలు వేసే విధంగా కృషి చేయాలన్నారు. మలేరియా, ఫైలేరియా, లెప్రసి, సుఖవ్యాధులపై అవగాహన కల్పిస్తూ, బాధితులను గుర్తించి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీలేఖ, రోహిత్, ఆరోగ్య అధికారులు సుధాకర్, రాధా, కిషన్, దయానంద్, సుధాకర్, దస్థిరాం, సాయిలు, అన్వరివేగం, యశోద, నరసమ్మ, సుశీల ఆరోగ్య సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎంపీడీఓ పర్బన్న



మాట్లాడుతున్న ఎంపీడీవో పర్బన్న

నవతెలంగాణ-బోధన్

సర్పంచ్‌ల పదవీకాలం ఫిబ్రవరి 1వ తేదీతో పూర్తి కావడంతో ప్రభుత్వం ఫిబ్రవరి రెండవ తేదీ నుంచి గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగించేలా చర్యలు చేపట్టిందని, కావున ఆయా గ్రామాలకు కేటాయించిన గ్రామ ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బోధన్ ఎంపీడీవో పర్బన్న అన్నారు. శుక్రవారం బోధన్ ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులకు ఆయన బాధ్యతలు అప్పగించి మాట్లాడారు. గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధీదీపాలు ఎప్పటికప్పుడు సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీఓ మధుకర్, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

గ్రామ ప్రత్యేక అధికారులు వీరే..

అమ్దాపూర్, బిల్లాల్ గ్రామ ప్రత్యేక అధికారిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ గోపి లక్ష్మి, బండారుపల్లి, కల్దుర్కి, రాంపూర్ గ్రామాలకు ఎంపీడీవో పరబన్న ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇరిగేషన్ ఏఈ. శ్రీనివాస్ లంగ్దాపూర్, బర్దిపూర్ గ్రామాల ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. ఎంపీఓ మధుకర్ భవానీపేట్, సంగెం, మినార్‌పల్లి గ్రామాలకు బాధ్యతలు చేపట్టారు. నీటిపారుదల శాఖ ఏ.ఈ. అనిల్ కుమార్ బిక్నెల్లి, ఖండ్గాం, సిద్దాపూర్ గ్రామాల ప్రత్యేక అధికారిగా, మండల వ్యవసాయ అధికారి సంతోష్ కుమార్ భూలక్ష్మి క్యాంప్, పెంటాకలాన్, పెగడపల్లి గ్రామాలకు ప్రత్యేక అధికారిగా, తహసిల్దార్ గంగాధర్ ఎరాజ్‌పల్లి గ్రామానికి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. హెల్త్ సూపర్వైజర్ ఇందిరా ఫతేపూర్, తగ్గెల్లి గ్రామాలకు, ఇరిగేషన్ ఏ.ఈ శ్రుతి పెంటాఖుర్ద్, పెంటాఖుర్ద్ క్యాంప్ గ్రామాలకు ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధిక సాలంపాడ్, సాలంపాడ్ క్యాంప్ గ్రామాలకు, సాలూర మండల తహసీల్దార్ సాలూర గ్రామానికి ప్రత్యేక అధికారిగా, ఏఎస్ఓ అశోక్ సాలూర క్యాంప్ గ్రామానికి ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టారు.

ఖానాపూర్‌లో ప్రహరీని కూల్చేసిన వీడీసీ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని ఖానాపూర్ గ్రామంలో శుక్రవారం వీడీసీ సభ్యులు తమ ప్రతాపాన్ని చూపించినట్టు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. గ్రామంలోని చర్చికి గల రెండువందల గజాల స్థలానికి కాంపౌండ్‌వాల్ ఏర్పాటు చేసుకోగా, వీడీసీ సభ్యులతో పాటు, వార్డు సభ్యులు, యూత్ సభ్యులు కలిసి ప్రహరీని ధ్వంసం చేశారు. ఈ విషయమై పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని, గ్రామాల్లో వీడీసీల పెత్తనంపై చర్యలు తీసుకోవాలని తెలిపారు.


ప్రహరిని కూల్చిన వీడీసీ సభ్యులు

నియామకపత్రం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి సతీమణికి వైద్యరంగంలో ఉద్యోగం రావడం హర్షనీయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణానికి చెందిన విజయ్ అగర్వాల్ సతీమణి సౌందర్య అగర్వాల్ ఇటీవలే బీఎస్‌సి నర్సింగ్ పూర్తిచేసి వైద్యరంగంలో ఉద్యోగం సంపాదించింది. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జ్ వినయ్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు.



మనశ్శాంతి కోవెల (సాంఘిక నవల)

4న ఆవిష్కరణ



నవతెలంగాణ-కంఠేశ్వర్
ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కవి, రచయిత డాక్టర్ మద్దుకూరి సాయిబాబు రచించిన మనశ్శాంతి కోవెల (సాంఘిక నవల) పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈ నెల 4ననిర్వహించడం జరుగుతుందని శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టి.చిరంజీవులు ఐ.ఏ.ఎస్ విశ్రాంత పూర్వ కార్యదర్శి తెలంగాణ ప్రభుత్వం కీలకోపన్యాసం డా.నాళేశ్వరం శంకరం సభాఅధ్యక్షులు ఘనపురం దేవేందర్ హరిదా రచయితల సంఘం అధ్యక్షులు, విశిష్ట అతిథులుగా పి.వి దుర్గా ప్రసాద్ కల్నల్-విశ్రాంత ఇండియన్ ఆర్మీ ఐ.గోపాల్ శర్మ-సీనియర్ న్యాయవాది హైకోర్టు విశిష్ట అతిథులుగా ప్రముఖ రచయిత్రి డా.అమృతలత, తదితరులు హాజరవుతారని తెలిపారు జిల్లాలోని కవులు,రచయితలు,కళాకారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆపరేషన్ స్మైల్‌లో 65మంది పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ కమిషనరేటు పరిధిలో జనవరి 01, 2024 నుండి జనవరి 31 వరకు ఆపరేషనర్ స్మైల్ కొనసాగిందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనివార్ శుక్రవారం తెలిపారు. 18 సంవత్సరాలోపు తప్పిపోయిన, వదిలివేయబడిన కార్మికులుగా ఉన్న బాలబాలికల సమాచారం సేకరించి, వారితో పని చేయించిన యజమానిపై కేసు నమోదు చేయడం కాని లేదా వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి అప్పగించడం కాని, తల్లి దండ్రులు లేని వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటి (సి.డబ్ల్యూ.సి) వారికి అప్పజెప్పడం జరుగుతుందని తెలిపారు. ఈఆపరేషన్ స్మైల్‌లో నిజామాబాద్, ఆర్మూర్ , బోధన్ డివిజన్లో మొత్తం 65 మంది పిల్లల్ని పట్టుకున్నాట్టు తెలిపారు. నిజామాబాద్ డివిజన్ నందు రెండవ పోలీస్ స్టేషన్ నందు ఇద్దరు యాజమానులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. మిగిత పిల్లల్ని సి. డబ్ల్యూసి వారి ఆదేశాల మేరకు వారి వారి తల్లిదండ్రులకు అప్పజెప్పడం జరిగిందన్నారు. తప్పిపోయిన పిల్లల వివరాలను దర్పన్ యాప్ నమోదు చేసి వారి అడ్రస్‌లను గుర్తించడానికి ప్రయత్నించడం జరిగిందని తెలిపారు.

ఉపాధి చట్టం ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో భాగంగా కమ్మర్‌పల్లిలో ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, బషీరాబాద్‌లో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్, పంచాయతీ ప్రత్యేక అధికారి మైలారం గంగాధర్ ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభమై నేటితో 18 సంవత్సరాలు పూర్తయి, 19వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం కూలీలకు కేక్, స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్ రమ, బషీరాబాద్ లో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, నాయకులు ఎస్. నారాయణ, కె. శ్రీనివాస్, దేవేందర్, శ్రీనివాస్, సంజీవ్, రాకేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, మెట్టు సురేష్, శ్రీనివాస్, స్వప్న, కూలీలు పాల్గొన్నారు.

అంగన్వాడి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

- హాజరైన టీఎన్జీవోఎస్ ఉద్యోగుల సంఘం చైర్మన్ అలుక కిషన్

నవతెలంగాణ-కంఠేశ్వర్
అంగన్వాడి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామమైన శ్రీనగర్‌లో అంగన్వాడి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీవోస్ పక్షాన ముఖ్య అతిథిగా హాజరై అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం అంగన్వాడి విధుల నిర్వహణలో ఉత్తమ సేవలు నిర్వహించిన అంగన్వాడీ ఉద్యోగులను అభినందించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ మాట్లాడుతూ.. మాత శిశు సంక్షేమ శాఖలో ప్రభుత్వ పథకాలు గ్రామాల్లో ప్రజలకు చేరవేయుటలో ప్రముఖ పాత్ర వహిస్తున్న అంగన్వాడీ ఉద్యోగులను ప్రశంసించక తప్పదని అన్నారు. అంగన్వాడి ఉద్యోగుల రెగ్యులరైజ్ కోసం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్ని ప్రజలందరికీ గడపగడపకు చేరవేయుటకు ప్రభుత్వ ఉద్యోగులు అత్యున్నత సేవలు నిర్వహిస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి సంపూర్ణ సహకారాన్ని అందజేసి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన సాలరీస్ 18 నెలలుగా పెండింగ్లో ఉన్న సప్లమెంటరీ పేమెంట్స్ అన్ని సకాలంలో మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, టిఎన్జీవో కేంద్ర బాధ్యులు పోలశ్రీనివాస్, ఎం.సతీష్, సలహాదారులు ఆకుల ప్రసాద్, సర్పంచ్ సురేందర్ రెడ్డి , టిఎన్జీవో జిల్లా కార్యవర్గ సభ్యులు, అంగన్వాడి టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు తార, జిల్లా కార్యదర్శి అనురాధ, అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సర్పంచ్ దంపతులకు సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని హస కొత్తూర్ గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ దంపతులను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమార్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ ఎంతగానో సహాయ సహకారాలు అందించారని తెలిపారు.పాఠశాలలో ఏదైనా సమస్య ఉంటే వారి దృష్టికి తీసుకు వెళ్లిన వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు.పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ దంపతులు చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారి, మండల విద్యాధికారి ఎన్. ఆంధ్రయ్య, పంచాయతీ కార్యదర్శి నల్లగంటి నర్సయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

టియుడబ్ల్యుజె రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్
ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజెయు) అనుబంధ సంఘం అయిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టియూడబ్ల్యుజె) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నిజామాబాద్ జిల్లా నుంచి బొబ్బిలి నర్సయ్య ఎం.ఎ.మాజీద్, జి.ప్రమోద్‌గౌడ్ ఎన్నిక అయ్యారని నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారి సిరిగాద ప్రసాద్ ప్రకటించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నిజామాబాద్ జిల్లాకు ముగ్గురికి అవకాశం కల్పించారు. ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ప్రకటించారు. ఈ మేరకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏడ్ల సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి. అరవింద్ బాలాజీ, జిల్లా కోశాధికారి సిరిగాధ ప్రసాద్ యూనియన్ జిల్లా కమిటీ తరుపున అభినందనలు తెలిపారు. యూనియన్ అభివృద్ధి కోసం జిల్లా కమిటీకి పూర్తిగా సహకరించి, జిల్లా జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ముందుండి పని చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర కమిటీలో జిల్లా సమస్యలపై స్పందించి చర్చించాలని కోరారు.

తనిఖీలేవి..? లోపించిన పర్యవేక్షణ

- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్
మీరు బేకరీకి వెళ్తున్నారా... జర జాగ్రత్తగా ఉండాలి. చాయి, సమోసా, బేకరీ, ఫుడ్స్, నూడుల్స్, ఫ్రైడ్ రైస్ ఇలా ఏదైనా సరే తినేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి. ఆహారంలో ఏదైనా రావచ్చు. ఉండొచ్చు. కొన్ని గల్లి హోటళ్ల నుంచి పెద్ద హోటళ్ల వరకు రుచి మాట దేవుడెరుగు. శుచి శుభ్రత లేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు.
పట్టణంలోని గురువారం డాల్ఫిన్ బేకరీలో నాణ్యత లోపంతో ఉన్న ఆహార పదార్థాలు బయటపడడం తీవ్ర కల వరం రేపింది. ఉమ్మడి జిల్లాలోని పలు హోటళ్లలో పరిశుభ్రత కరువైంది. పర్యవేక్షించే నాథుడే లేకుండా పోయారు. సంబంధిత అధికారులతోపాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉండగా ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదు. ప్రధానంగా వంటచేసి గదులు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. అక్కడే పాత్రలు కడగడం పరిశుభ్రత లేని వాతావరణంలో వంటలు చేస్తుండడం మం చి నూనెలు కాకుండా నాసిరకం నూనెలు వాడుతున్నారని వినియోగదారుల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నవి.

పెద్ద హోటళ్లలోనూ.. ఆర్డర్ మెస్‌లలోను..
డివిజన్లోని 100కు పైగా పెద్ద హోటళ్లు, 500వరకు ఆర్డర్ మెస్సులు, ఫాస్ట్ ఫుడ్, టిఫిన్ సెంటర్లు ఉన్నవి. పేరు మోసిన పలు హోటళ్లలోను నాసిరకం ఆహార పదార్థాలే లభిస్తున్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. వంద లాది రూపాయలు వసూలు చేసే హోటళ్ల యజమానులు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఆదాయమే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

గుండె గుభేలు...
డివిజన్లోని పలు హోటళ్లలో బేకరీ టిఫిన్ సెంటర్లలోనూ కస్టమర్ల ఆకలిని ఆసరాగా చేసుకొని అధిక రేట్లను వసూలు చేస్తున్నారు. టి మొదలుకొని పప్పన్నం, బిర్యానీల వరకు ఏది తినాలన్నా జేబులు ఖాళీ చేసుకోవాల్సిందే. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తమ ఇష్టానుసారంగా వెళుతున్న హోటల్లు టిఫిన్ సెంటర్లతో ఫుడ్ బిజినెస్ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. వినియోగదారులను ఆకర్షించడా నికి వీటిలో రుచి కోసం రకరకాల ఆహార పదార్థాలను వాడుతున్నారు. రుచి కోసం ఇలా మనుషుల ఆరోగ్యం పాడు చేసే పదార్థాలు వాడటం అయితే పూర్తిగా నాణ్యత లేకపోవడం మరో కారణం. ఏదిఏమైనా హోటళ్లలో కనీసం నిబంధనలు పాటించాల్సింది పోగా నాణ్యత అసలు పాటించిన దాఖలాలు ఉన్నట్లు కనబడడం లేదు.. పేరుకేమో పెద్ద హోటల్లు కానీ తిండి విషయంలో నాణ్య త కరువైతుంది. తిండి పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగు తున్న అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. అడపాదడపా తనిఖీలతో హడావిడి తప్ప నిరంతర నిగ ఊస లేదు. ఏదైనా సంఘటన జరిగితే మాత్రం హడా వుడి చేసి అప్పటికప్పుడు ఆ హోటళ్లపై దాడులు చేయడం ఏ ఆహారం ద్వారా సమస్య వచ్చిందో ఆహార పదార్థాల శాం పిల్స్ తీసుకెళ్లడం, వాటిని హైదరాబాద్‌కు పరిశీలన కేంద్రా నికి పంపించి చేతులు దులుపుకుంటున్నారు. తదనంతరం వాటి ఫలితం వచ్చిందో రాలేదు కూడా పట్టించుకున్న పాపాన పోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కంటి తడుపుగా దాడులు...
హోటళ్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్లలో అసలేం జరుగుతుందో తెలియని పరిస్థితి. ప్రజల నుంచి ఇలాంటి విమర్శలు రావద్దనే ఉద్దేశంతో అప్పుడప్పుడు కంటి తుడుపు దాడులు నిర్వహిస్తూ తాము కూడా ఉద్యోగం చేస్తున్నామని సంబంధిత శాఖల అధికారులు హడావుడి నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ఒక బేకరీలో జరిగిన ఘటనపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో లేకపోవడం గమనార్హం.



అధికారులు స్పందించాలి..
మున్సిపల్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సానిటరీ ఇన్‌స్పెక్టర్లు సంబంధిత హోటల్లు బేకరీలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల యందు పర్యవేక్షించడంతోపాటు నిఘాపెట్టాలి.
తులసి పట్వారి,సామాజిక సేవకుడు, ఆర్మూర్.

బేకరీ షాపును తనిఖీ చేసిన సానిటరీ ఇన్‌స్పెక్టర్



ఆర్మూర్: పట్టణంలోని బాలాజీ పెట్రోల్ పంప్ ఎదురుగా నున్న డాల్ఫిన్ బెంగళూరు బేకరీ దుకాణంలో కుళ్లిన కేక్ లు విక్రయిస్తున్నారని ఫిర్యాదు మేరకు మునిసిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ శుక్రవారం తనిఖీ చేశారు. డాల్ఫిన్ బెంగళూరు బేకరీలో పుట్టినరోజు వేడుకలకు తీసుకెళ్లిన కేక్ కుళ్ళిపోవడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఈ వార్త దినపత్రికలలో రావడంతో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించి శుక్రవారం బేకరీ దుకాణంలోని కేక్‌లు, పలు తినుబండారాలను తయారు చేసే వంటగదిని తనిఖీ చేశారు. వంటగది అస్తవ్యస్తంగా అపరిశుభ్రతగా ఉండడా న్ని పరిశీలించి దుకాణంలో పనిచేస్తున్న ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తయారీ పదార్థాలలో వాడే నూనె సైతం పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించనట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బేకరీ దుకాణాన్ని పరిశీలించిన ఇన్‌స్పెక్టర్ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల బాధితులతో పాటు పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడతున్న నాణ్యతలేని కేక్‌లు, తినుబండారాల విక్రయాల బేకరీ షాపులన్నింటిని విస్తృతంగా తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బేకరీ దుకాణంలో తనిఖీలు చేసి దుకాణాన్ని సీజ్ చేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

లక్ష్మీనరసింహస్వామి మూడవ వార్షికోత్సవం

- అన్నదానం


సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-మోపాల్
మండలంలోని బోర్గం(పి) గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వేకువ జామున నుండే గ్రామ ఈగ పరివారం ఆధ్వర్యంలో స్వామికి అభిషేకం పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్న ఈగ సంజీవరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సం జీవరెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో పాడిపం టలు అభివృద్ధి చెందుతూ గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఈగ రమేష్ రెడ్డి రజిత దంపతులు, ఈగ గంగా సాగర, ఈగ చిన్నారెడ్డి, గోపాల్ రెడ్డి, ఈగ రవీందర్ రెడ్డి, ఈగ గంగారెడ్డి, పరివారం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
మోడీ ప్రభుత్వం కార్పొరేటు కంపెనీలకు ఊడిగం చేస్తుందని ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం శ్రామిక భవన్, కోటగల్లిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. ముత్తెన్న ఎం.సుధాకర్ మాట్లాడుతూ... మోడీ ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను అవలంభిస్తుందన్నారు. నిన్న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వానికి ఆదాయం పెరిగినా, ప్రజల కోసం ఆయా రంగాలకు కేటాయింపులు తగ్గించిందని ఆరోపించారు. ముఖ్యంగా కార్మిక వర్గానికి, రైతాంగానికి, మహిళలకు, విద్యార్థులకు అతి తక్కువ కేటాయింపులు చేశారన్నారు. గత సంవత్సరం కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. పెరిగిన ఆదాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు రాయితీల రూపంలో లక్షల కోట్ల రూపాయలను అప్పగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ ప్రజల్ని మభ్యపరచడానికి మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతతత్వ విధానాలను ఎండగట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ కు పిలుపునిచ్చాయన్నారు. జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు ఈ సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్, జిల్లా నాయకులు డి.కిషన్, బి.మురళి, టి.విటల్, డి.కిరణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయు నాయకులు

5 ఏండ్ల పనులు గుర్తుండిపోతాయి


సర్పంచులను పసన్మానించిన పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్
మండలంలోని జాగిర్యాల గ్రామపంచాయతీ పాలకవర్గానికి శుక్రవారం గ్రామపంచాయతీ, వీడీసీ, అంగన్వాడి టీచర్స్, పాఠశాల సిబ్బంది, వివిధ శాఖల ఆధ్వర్యంలో సన్మానం చేశారు. వీడీసీ సభ్యులు ఒక్కొక్కరిగా మాట్లాడుతూ వారు చేసిన సేవలు చరిత్రలో గుర్తుండపోతాయి అంటూ అభినందనలు తెలిపారు.

సర్పంచులకు వీడ్కోలు సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
ఐదు సంవత్సరాల పదవి కాలాన్ని పూర్తి చేసుకున్న తాజా మాజీ సర్పంచ్‌ను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. ప్రజల కోసం అన్ని గ్రామాల సర్పంచులు ఎంతో ఉత్సాహంతో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలుపరిచారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించడం ద్వారా ప్రజలకు సేవ అవకాశం కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు గడ్డం స్వామి, సక్కారం అశోక్, మారు శంకర్, పుప్పాల గంగాధర్, పెండే ప్రభాకర్, సునావత్ లస్కర్, దయ్య దేవయ్య, గుగులోతు భాస్కర్, పాలెపు సాయమ్మ లకావతి చిన్ని, బద్దం పద్మ చిన్నారెడ్డి, ఇంద్రాల రూప రాజేందర్, ఏనుగు పద్మ రాజేశ్వర్, అమరగొని రోజా, సదాశివ గౌడ్, వైస్ ఎంపీపీ కాలేరు శేఖర్, ఎంపీటీసీ సభ్యులు పిప్పెర అనిల్, మైలారం సుధాకర్, నోముల రజిత, ఏశాల నరసయ్య, దుబ్బాక సుప్రియ, తోట జ్యోతి, బుస్సాపురం సుప్రియ, లకావత్ గంగాధర్, కో ఆప్షన్ సభ్యుడు అజ్మత్ హుస్సేన్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ మైలారం గంగాధర్, మండల పంచాయతీ అధికారి సదాశివ్, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.


సర్పంచులను పసన్మానించిన పలువురు

ఇంటి పేరుతోనే పిలుస్తారు

- ప్రధానోపాధ్యాయుడి ప్రత్యేకత
- వాహనాల నెంబర్లు చెప్పేస్తారు


జంగం అశోక్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
జక్రాన్ పల్లి మండలం తొర్లికొండ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు ఎల్ఎఫ్ ఎల్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. వేల్పూర్ మండలం జానకం పేట గ్రామానికి చెందిన జంగం అశోక్ 20 సంవత్సరాల నుండి ఉపాధ్యాయులు, విద్యార్థులు మిత్రులు శ్రేయోభిలా షులను వారి వారి ఇంటిపేరుతో పిలుస్తారు. జంగం అశోక్ కు ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి ఇంటి పేరును ఒకసారి చెబితే చాలు ఎన్నిసార్లైనా తిరిగి అదే ఇంటి పేరుతో పిలవడం ఆయన ప్రత్యేకత. అంతేకాదు ఉపాధ్యాయుల స్నేహితుల (టూ వీలర్) వాహనాల నంబర్ ప్లేట్లు నోటికి చెప్పడం ఆయన స్పెషాలిటీ. 200 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, మిత్రులు శ్రేయోభిలాషులను ఒకే స్థలంలో కూర్చోబెట్టి వాళ్ల వాళ్ల ఇంటి పేరు చెప్పి అనంతరం తిరిగి వారి ఇంటి పేర్లను చెప్పేస్తారు. తన గ్రామంలో సైతం ఇంటి పేరుతో పిలుస్తారు.

16న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- భారత గ్రామీణ బంధుతో మోడీ గద్దె దిగడం ఖాయం
- సిఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్
ఈనెల 16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భారత గ్రామీణ బందుతో మోడీని గద్దె దించడం ఖాయమని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ సిఐటియు కార్యాలయంలో ఫిబ్రవరి 16న జరిగే సమ్మె పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. ఒకవైపు కార్మికుల హక్కులను చట్టాలను తుంగలోకి తొక్కుతూ మరోవైపు రైతులను వ్యవసాయ కార్మికులకు వ్యతిరేక చట్టాలను రూపొందిస్తూ ప్రజా వ్యతిరేక పాలనను అవలంభిస్తున్న నరేంద్ర మోడీని గద్దె దింపేందుకు కార్మికులు కర్షకులు ఐక్యంగా ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ బంధును విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. ప్రజలకు మతం అనే మత్తుమందు చల్లి నరేంద్ర మోడీ పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. కనీస వేతనం అమలుకోసం కార్మికులకు సామాజిక భద్రత కోసం అదేవిధంగా రైతులు వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 16న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను కార్మికులు, కర్షకులు కలిసి విజయవంతం చేయాలని కోరారు. గతంలో రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోడీకి బుద్ధి చెప్పే లాగా రైతులందరూ ఐక్యంగా ఉద్యమించి మోడీ మెడలు వంచిన విషయాన్ని స్ఫూర్తిగా తీసుకొని జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతూ కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కి బిజెపి ప్రభుత్వానికి గద్దె దింపితేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎంతోమంది కార్మికులు ప్రాణాలు త్యాగంచేసి సాధించుకున్న 8 గంటల పని విధానం కూడా బిజెపి సర్కార్ కాలరాయాలని చూస్తుందని భవిష్యత్తులో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేసేందుకు సిఐటియు సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమ్మెలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నాయక్ వాడి శ్రీనివాస్ కటారి రాములు, కృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కాంతి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్


ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని పెర్కిట్ కాంతి హై స్కూల్ లో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు తామే స్వయంగా తయారు చేసిన వంటకాలను స్టాల్స్‌లో ప్రదర్శించి విక్రయించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి మాట్లాడుతూ.. అమ్మ చేతి వంట యొక్క ప్రాముఖ్యతను, వంటగదిలో అమ్మ పడే కష్టాన్ని పిల్లలకు తెలియజేసే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. అలాగే వ్యాపార విలువలు లాభనష్టాల బేరీజు గురించి పిల్లలకు ఈ వయసులోనే అవగాహన వచ్చేటట్టుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. పాల్గొన్న విద్యార్థులను అభినందించి, విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శనివారం | ఫిబ్రవరి 03, 2024 | www.navatelangana.com

వెయిట్ లిఫ్టింగ్‌కు ఎంపికైన విద్యార్థినికి సన్మానం



నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ ఆదర్శ పాఠశాలల ఉమ్మడి జిల్లాల ఎస్‌జీఎఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో రెంజల్ ఆదర్శ పాఠశాల విద్యార్థిని మాలతిని పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం సన్మానించారు. అండర్-17 ఇయర్స్ విభాగంలో 76 కేజీల వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రథమ స్థానంలో రావడంతో ఆమె రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో సైతం అత్యుత్తమ ప్రతిభను కనబరచాలని ఆయన అభినందించారు. ఆయనతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

చెన్నై ర్యాలీలో ఎస్ఎఫ్ఐ కామారెడ్డి అధ్యక్ష, కార్యదర్శులు



నవతెలంగాణ-కామారెడ్డి

చెన్నై ర్యాలీనీ తమిళనాడు యువజన సంక్షేమం, క్రీడాల అభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించారు. చెన్నై ర్యాలీలో ముగింపు సభలో తమిళనాడు విద్యాశాఖ మంత్రి అంబిల్ మహేష్ పొయ్యామొజహి పాల్గొన్నారు. నూతన విద్యావిధానం 2020ను పూర్తిగా రద్దు చేయాలని కోరుతున్న విద్యార్థులకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ చెన్నై ర్యాలీలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర నాయకులు, కామారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అరుణ్, ఎస్.అజయ్ పాల్గొన్నారు.



లింగంపేట్: సర్పంచ్‌లకు సన్మానం



నిజాంసాగర్: సర్పంచ్‌లను సన్మానించిన పలువురు



రామారెడ్డిలో...



జుక్కల్‌లో...

గ్రామాభివృద్ధిలో సర్పంచులది ప్రధాన పాత్ర

- లింగంపేట్ జెడ్పిటిసి సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

ఐదు సంవత్సరాలపాటు అందరి సహకారంతో సర్పంచులు గ్రామాలను అభివృద్ధి చేశారని లింగంపేట్ జడ్పిటిసి సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు తాజా మాజీ సర్పంచ్‌లను, ఉప సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. సర్పంచ్‌లు ఎలాంటి వివక్షత చూపకుండా సోదరభావంతో పనిచేశారని తెలిపారు. అనంతరం తాజా మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నిసా, జడ్పీటీసీ శ్రీలత సంతోష్‌రెడ్డి, ఎంపీఓ ప్రభాకర్‌చారి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాజయ్య, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సర్వస్, ఎంపీటీసీ శమిమున్నిసా ఫతియొద్దీన్, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవీందర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో పార్టీలకు అతీతంగా పనులు..

జెడ్పీ నిధులతో మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని లింగంపేట్ జెడ్పిటిసి సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఒంటరిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశానుసారం జిల్లా పరిషత్ నిధులతో సీసీ రోడ్డు పనులకు టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 41 గ్రామ పంచాయతీల పరిధిలో జెడ్పీ నిధులతో పార్టీలకతీతంగా అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధికి రాజకీయాలు అడ్డురావన్నారు. ఒంటరి పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ సీసీ రోడ్డు మంజూరు చేయాలని జెడ్పిటిసి దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు పనులు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో తగినటువంటి సమస్య మురికి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, బోరు మోటర్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జెడ్పీ నిధులతో మరిన్ని పనులు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజయ్య ఆయా గ్రామాల సర్పంచ్‌లు రామ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎంపిటిసి భాగవ్వ, సాయిలు, గ్రామ పెద్దలు రాజిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, సంగారెడ్డి చంద్రారెడ్డి, గ్రామపంచాయతీ పాలకరకం సభ్యులు తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌కు ఘనంగా సన్మానం

నిజాంసాగర్: గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో మల్లూరు గ్రామ పంచాయతీలో ప్రభుత్వ స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ (సీనియర్ అసిస్టెంట్ నిజాంసాగర్ పంచాయతీరాజ్)ను ప్రభుత్వం నియమించింది. ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా సర్పంచ్ పదవీకాలం ముగియడంతో సర్పంచ్ కాసింసాబ్, పాలకవర్గం అందరికీ సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కాసింసాబ్ మాట్లాడుతూ.. ఇన్ని రోజులు బాధ్యతలు నిర్వర్తించడానికి సహకరించిన గ్రామంలోని ప్రజలకు అధికారులకు పాలకవర్గ సభ్యులకు అందరికీ కూడా ధన్యవాదాలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన స్పెషల్ ఆఫీసర్ గ్రామం గురించి ఆరా తీశారు. పారిశుధ్య పనులు ప్రతిరోజు కూడా చేపట్టాలని ఆయన పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో దుర్గేష్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, సొసైటీ చైర్మన్ కళ్యాణి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ పాలకవర్గ ఆత్మీయ సమ్మేళనం

రామారెడ్డి: మండలంలోని గొల్లపల్లి, అన్నారం తదితర గ్రామాల్లో గ్రామపంచాయతీ సర్పంచ్‌తో పాటు పాలకవర్గం దిగ్విజయంగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీడీసీ పాలకవర్గం గ్రామపంచాయతీ పాలకవర్గానికి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించి, శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, పాలకవర్గ సభ్యులుగా ఎన్నుకున్న ప్రజలకు, ఐదు సంవత్సరాలు అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు పాల లావణ్య మల్లేష్, కూడెల్లి అమృత, ఉపసర్పంచ్లు శ్రీనివాస్‌రెడ్డి, నరసయ్య, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు సాగర్, జనార్ధన్, వీడీసీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను సన్మానించిన ఎంపీపీ

జుక్కల్: మండలంలోని బిజ్జల్‌వాడి సర్పంచ్ పదవీకాలం ముగియడంతో గ్రామస్తుల ఆధ్వర్యంలో సర్పంచ్ గౌళే యాదవ్‌ను ఎంపిపి యశోద, వైస్ ఎంపిపి ఉమాకాంత్ శుక్రవారం ఘనంగా సన్మానించారు.నీ సందర్భంగా గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఎంపిడివో నగేష్ అన్నారు. మంచి పనులు చేస్తే వారిని చిరకాలం గ్రామస్తులు గుర్తుంచుకుంటారని కష్టపడే తత్వం ఉండాలని ఎంపివో యాదగిరి అన్నారు. కార్యక్రమంలో జేపిఎస్ దివ్య, నాయకులు నీలుపటేల్, దాదారావ్‌పటేల్, మాదారావ్ దేశాయి, బొల్లిగంగాధర్, సీనియర్ అసిస్టెంట్ రంజిత్ కూమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను సన్మానించిన ఉపాధ్యాయులు

రెంజల్: మండలంలోని దూపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం సర్పంచ్ శనిగరం సాయి రెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. గత ఐదు సంవత్సరాలుగా సర్పంచ్ గ్రామ అభివృద్ధితో పాటు, పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని ప్రధానోపాధ్యాయులు గణేష్‌రావు అన్నారు. సర్పంచ్ పదవి కాలం పూర్తి కావడంతో ఆయనను శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్ష కార్యదర్శులు సోమలింగం, సాయిరెడ్డి, ఉపాధ్యాయులు బి.వెంకటలక్ష్మి, రాజేశ్వర్, రాధా, పరమేశ్వర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గాన్ని సన్మానించిన పంచాయతీ కార్యదర్శి

రాజంపేట్: మండలంలోని పొందుర్తి పంచాయతీ పాలకవర్గం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా పొందుర్తి గ్రామ పాలకవర్గాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి రాజు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 సంవత్సరాల కాలంగా గ్రామాభివృద్ధి కోసం కృషి చేసిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాలరాజుగౌడ్, సర్పంచ్ గంగాకిషన్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లొంగన్ సర్పంచ్‌కు సన్మానం

జుక్కల్: మండలంలోని లొంగన్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉషారాణి, ఉపసర్పంచ్ రమేష్‌ను ఎంపిపిఎస్ హెచ్ఎం నీలిమా ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ సహకారంతో శుక్రవారం ఉపాధ్యాయులు, జీపీ సెక్రటరీలు, గ్రామస్తులు కలిసి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. గ్రామానికి తన పదవి కాలంలో సేవలందించిన సర్పంచ్ సేవ నిరతిని కొనియాడారు. పాఠశాలతో పాటు గ్రామాభివృద్ధికి తోడ్పడినందుకు పాఠశాల, గ్రామస్తుల తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి సంగమంలో భక్తుల తాకిడి



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పుష్కర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బకాయి పడ్డ దుకాణాలకు తాళం



షాపుకు తాళం వేస్తున్న అధికారులు

నవతెలంగాణ-బోధన్

పట్టణంలో మున్సిపాలిటికీ ఆస్తిపన్ను బకాయిలు ఉన్న పలు 11వ్యాపార దుకాణాలకు మున్సిపల్ అధికారులు తాళాలు వేశారు. వ్యాపార సంస్థల వారు నిర్ణీత సమయంలో మున్సిపల్ కార్యాలయంలో ఆస్తిపన్ను చెల్లించి రశీదు పొందాలని లేని ఎడల దుకాణాలకు తాళాలు వేయనున్నట్టు హెచ్చరించారు.

మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదామని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తట్టికోటలో నిర్వహించిన బీడీ కార్మికుల సమస్యల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో మోడీ నాయకత్వంలోని బీజేపీ పార్టీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్దఎత్తున ఉద్యమించాలని బీడీ కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో లేనప్పుడు తాము అధికారంలోకి వస్తే, నిత్యావసర సరుకుల ధరలను తగ్గిస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలని కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ధరలను పెంచుతూ పోతున్నారని తెలిపారు. ఉద్యోగాల విషయంలో కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించకపోను ఉన్న పరిశ్రమలనే మూసి వేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, బీడీ కార్మిక సంఘం బోధన్ జిల్లా కమిటీ నాయకులు రమా, ఏరియా కమిటీ నాయకులు లక్ష్మి, గంగామణి, సావిత్రి, గోదావరి, నర్సా, విజయ, జమున, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ



వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

శ్రీ స్వామి వివేకానంద అడుగుజాడల్లో యువత దేశం కోసం, ధర్మం కోసం, న్యాయం కోసం నడవాలని సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ రామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. శ్రీ స్వామి వివేకానంద సమాజానికి ఇచ్చిన స్పూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ఉపాధ్యక్షులు రాంసింగ్, ఎంపీటీసీలు రజిత రాజేందర్‌గౌడ్, భాగ్యలక్ష్మి శ్యామ్, మాజీసర్పంచ్ దండబోయిన సంజీవ్, అమ్ముల శ్రీనివాస్, పటేండ్ల రమేష్‌రెడ్డి, బుల్లి రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చెట్లను సంరక్షించాలి



మొక్కకు నీరు పోస్తున్న అధికారులు

నవతెలంగాణ-రాజంపేట్

ప్రతి ఒక్కరూ చెట్లకు నీటిని అందించి వాటిని సంరక్షించాలని మండల అభివృద్ధి అధికారి బాలకిషన్ పేర్కొన్నారు. శుక్రవారం వాటర్ డేను పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలకు నీటిని అందించారు. అలాగే అన్ని గ్రామపంచాయతీలలో కూడా వాటర్ డే కార్యక్రమం చేపట్టి చెట్లకు నీరు పట్టవలసిందిగా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో టిఏ రాజు, బ్రహ్మాచారి, సీనియర్ అసిస్టెంట్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-దోమకొండ/రాజంపేట్

మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం దోమకొండ, బిబిపేట మండలాలకు చెందిన 15 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్, ఎంపీపీ శారదా నాగరాజు, తహసీల్దార్ సంజయ్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ రేఖ, ఆర్ఐ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట్ : మండల కేంద్రంలోని రైతు వేదికలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సంతోషి, ఎంపీటీసీ రాజు, బిజెపి మండల అధ్యక్షుడు గంగారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చేనూర్ గ్రామంలో వాటరింగ్ డే



చెట్లను పరిశీలిస్తున్న అధికారి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని చేనూర్ గ్రామంలో శుక్రవారం వాటరింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వనంలో గల మొక్కలకు ఎంపీడీవో రఘు, సూపరింటెండెంట్ వినోద్ నీరు పోశారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయంగా మొక్కలకు నీళ్లు పోయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సురేందర్ తదితరులున్నారు.

షబ్బీర్ అలీని సన్మానించిన రక్తదాతల సమూహం



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా ఇటీవల నియామకమైన మాజీ మంత్రి, మహమ్మద్ షబ్బీర్‌అలీని కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో కలిసి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు. రక్తదాతల సమూహ ఆధ్వర్యంలో సంవత్సర కాలంలోనే 1950 యూనిట్ల రక్తాన్ని తలసేమియా చిన్నారులకు అందజేసినట్టు, గడిచిన 16 సంవత్సరాలుగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తున్నామని వారికి తెలియజేశారు. కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో రక్తదానంలో చేస్తున్న సేవలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ అభినందించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్, ప్రధాన కార్యదర్శి గంపప్రసాద్, ఉపాధ్యక్షులు జమీల్ హైమద్, కిరణ్, యువజన కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో గల కస్తూర్బా పాఠశాలను ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పలురకాల చిన్న చిన్న ఆరోగ్య సమస్యలున్న వారికి అక్కడే మైనర్ ట్రీట్మెంట్ అందజేశారు. ఇంకా ఎవరైనా విద్యార్థులకు ఎక్కువగా ఆరోగ్య సమస్యలున్నా కోటగిరి ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని ఆరోగ్య సిబ్బందికి తెలియజేశారు. అంతేకాకుండా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చేతుల పరిశుభ్రత నిరంతరం ఉండాలని తెలియజేశారు. ఈ నెల 12వ తేదీన విద్యార్థులందరు ఆల్బెండజోలు మాత్రలు వేసుకోవాలని, జనవరి 30వ తేదీ నుంచి 13.02.2024 వరకు లేప్రోసి అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కుష్టువ్యాధిపైన పూర్తిస్థాయి అవగాహన కలిగించి, కుష్టువ్యాధి లక్షణాలు, నివారణకు జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సవిత రాణి, సూపర్‌వైజర్ జ్యోతి, శ్రీదేవి, సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎంపీపీ దశరథ్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రంగంపేట మాజీ సర్పంచ్ అంగళ్ళ శ్యామగౌడ్ కాలుకు ఆపరేషన్ కావడంతో పోసానిపేట్ గ్రామానికి చెందిన చిన్న బాపురెడ్డి అనారోగ్యానికి గురికావడంతో శుక్రవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్య ఖర్చులను ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఎంపీ బీబీ పాటిల్ కృషితో అందేలా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కిరణ్ కుమార్‌రెడ్డి, లింబాద్రి నాయక్, పోతుల లింగారెడ్డి, సంజీవరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు బిజెపి నాయకుల సన్మానం



నవతెలంగాణ-మద్నూర్

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన కాటిపల్లి వెంకటరమణ రెడ్డి మద్నూర్ మండల కేంద్రానికి మొట్టమొదటిసారిగా రావడంతో మద్నూర్ మండల బిజెపి నాయకులు చట్లవార్ హన్మండ్లు, మండలాధ్యక్షులు బి.హనుమాన్లు, కృష్ణ పటేల్, తుకారాం యాదవ్ రావు, సంతోష్, శ్రీనివాస్ కలిసి శుక్రవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ కామారెడ్డి ఎమ్మెల్యే నాయకత్వంలో ఎంపీ సీటు గెలుచుకోవడం ఖాయమని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా సంపత్‌గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కామారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు బొంబోతుల సంపత్‌గౌడ్ జన్మదిన వేడుకలను కామారెడ్డి పట్టణంలోని విజయదుర్గ రెస్టారెంట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి కేక్ కట్ చేసి ఆనందోత్సవాల మధ్య ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు. గాంధారి, సదాశివనగర్, ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జైగౌడ ఉద్యమ నాయకులు బొంబోతుల లింగాగౌడ్, బాలా అర్జున్‌గౌడ్, సంఘం కుమ్మరి రాములు, మద్దెల భాగయ్య రాంగోళ్ళ మురళిగౌడ్, బండారి సాయిరాంగౌడ్, అంకన్నగారి నాగరాజ్ గౌడ్, అంకన్నగారి శ్రీనివాస్ గౌడ్, ఇందూరి సిద్ధాగౌడ్, బొంబోతుల నరేష్‌గౌడ్, రవికుమార్‌గౌడ్, నందివాడ బాబాగౌడ్, కాషాగౌడ్, జగ్గ బాలరాజు, చిందం రాజయ్య, బొంపెల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు ప్రత్యేకాధికారులు



నవతెలంగాణ-ఎడపల్లి

సర్పంచ్‌ల ఐదు సంవత్సరాల పదవీ కాలం పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు గెజిటెడ్ హోదా కలిగిన అధికారులను నియమించింది. ఎడపల్లి మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా.. అంబం(వై), జానకంపేట్ గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ మోతి సింగ్, బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా గోపాలకృష్ణ (ఎంపీడీవో), ఏఆర్ క్యాంప్, ధర్మారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా మండల పరిషత్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, బాపునగర్, మంగళ్‌పహాడ్‌కు ఈ సందీప్ (పశువైద్యశాల అసిస్టెంట్ సర్జన్), మండల విద్యాశాఖ అధికారి, రామారావు, దుబ్బతాండా, సిద్ధి రామేశ్వరరావు (వ్యవసాయ శాఖ అధికారి), జైతాపూర్, జంలం, గబ్బర్‌సింగ్ (ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ), కుర్నపల్లి, తానాకలాన్, నీటిపారుదల శాఖ ఏఈఈ రాజ్యలక్ష్మి, ఎమ్మెస్సీ ఫారం, లిఖిత (పిఆర్ఏఈ), నెహ్రూ నగర్, పోచారం, సుభాష్ చంద్రబోస్ (ఎంపీఓ), వడ్డేపల్లి, ఎడపల్లి గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు.

ఉపాధిహామీ కూలీలకు సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని అధికారులు ఘనంగా జరిపారు. ఈ పథకం 19 సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో 100 రోజులు పూర్తిచేసుకున్న కూలీలతో పని ప్రదేశంలో కేక్ కట్ చేయించి వారికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశం, ఏపీఓ వెంకటేష్, టీఏ అరవింద్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.


కూలీలతో కేక్‌కట్‌చేసి సన్మానిస్తున్న అధికారులు

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడు మృతి

తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గంలోని నందిపేట్ మండల యూత్ నాయకులు ,లక్కంపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ సుమలత భర్త మూడ మహేందర్(39) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఆయన మరణం పట్ల మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు .పార్టీకి విధేయులుగా ఉన్న మహేందర్ అతి చిన్న వయసులో గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నియోజకవర్గ నాయకులు రాజేశ్వర్ రెడ్డి, పట్టణ, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు పూజ నరేందర్, ఆలూరు శ్రీనివాస్ రెడ్డి, పిప్రి, ఆలూరు గోవింద్‌పేట్ సొసైటీల చైర్మన్లు సోమ హేమంత్ రెడ్డి, తంబూరి శ్రీనివాస్, బంటు మహిపాల్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.


మహేందర్ (ఫైల్)

గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సత్కారం


జీపీ పాలకవర్గాన్ని సన్మానించిన సర్పంచ్

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని చీమన్ పల్లి గ్రామ పంచాయతీ పాలకవరం ఐదు సంవత్సరాలు పదవి కాలం ముగియడంతో శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పద్మ -శివారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి మెమోంటోను అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆశీస్సులతో చీమన్ పల్లి గ్రామానికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని అన్నారు. గడచిన ఐదు సంవత్సరాలు తన సొంత గ్రామ ప్రతి సమస్య పరిష్కారానికి తన వెన్నంటే ఉంటూ సహాయ సహకారాలు అందించిన బాజిరెడ్డి గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. తాను సర్పంచ్ గా ఎన్నికైనప్పటినుండి తనకు సహకరిస్తూ ఆదరించిన గ్రామ యువకులకు, యువజన సంఘాలకు, మహిళా సంఘాలకు, కుల సంఘాలకు, గ్రామ అధికారులకు గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పంచాయతీ పాలక వర్గం సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీత రాజేందర్ , ఉప సర్పంచ్ బన్ని నాయక్, బుక రాజు, ఏఎన్ఎం వసంత, చార్వాక ప్రసాద్, వార్డు మెంబెర్, పంచాయతీ కార్యదర్శి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

బినోల సర్పంచ్, ఉప సర్పంచ్‌కు సన్మానం


సర్పంచ్, పాలకవర్గాన్ని సన్మానించిన జీపీ కార్యదర్శి

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని బినోల సర్పంచ్ పీతాంబర్, ఉప సర్పంచ్ పుట్టి పోశెట్టి లకు గ్రామ పెద్దలు శుక్రవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా గ్రామంలో ప్రజలకు విజయవంతంగా సేవలు అందించారని అన్నారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యదర్శి శ్రీకాంత్ పాలకవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు, వైస్ చైర్మన్ బాబర్, డైరెక్టర్ అంజా గౌడ్ మరియు గ్రామ పెద్దలు జంగిటి మోహన్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పనిచేయాలి


ప్రత్యేకాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-సిరికొండ

గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పని చేయాలని స్పెషల్ ఆఫీసర్ లకు తహసీల్దార్, ఎంపీడీఓలు సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక అధికారులకు సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యదర్శులకు అర్థం కాని విషయాలను ప్రత్యేక అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ ద్వారా ప్రజలకు సేవలు అందించాలన్నారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీలకు గాను 14 మంది ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి ప్రసాద్, తహసీల్దార్ రవీందర్ రావు, అహ్మద్ హుస్సేన్, సాయినాథ్, అర్షద్, శివ, గంగారాం, ప్రియదర్శిని, సవిత, బాపురావు, వెంకటేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యల్ల రాములు సేవలు చిరస్మరణీయం

- బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి


నివాళ్లు అర్పిస్తున్న నాయకులు, కుటుంబీకులు

నవతెలంగాణ-ఆర్మూర్

కీర్తిశేషులు మాజీ ఎంపీపీ యల్ల రాములు పట్టణ అభివృద్ధి తో పాటు మారుమూల గ్రామాల అభివృద్ధిలో నిర్విరామ కృషి చేశారని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఆయన జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆలూరు రోడ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ అధ్యక్షునిగా పనిచేస్తున్న సమయంలో పేద ప్రజలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రజా నాయకునిగా పేద, బడుగు బలహీన వర్గాల కోసం సేవ చేశారని అన్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే యల్ల రాములు హయాంలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చెందాయని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, గడ్డం మల్లారెడ్డి, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం

- బాధ్యతల స్వీకరించిన అధికారులు
- సన్మానించిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-విలేకరులు

మండలంలోని గ్రామపంచాయతీలో శుక్రవారం నుండి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. ఇప్పటివరకు కొనసాగిన సర్పంచుల పదవీకాలం గురువారంతో ముగిసింది. మండలంలోని ఆయా పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ గురువారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారులు బాధ్యతలను స్వీకరించారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని కమ్మర్‌పల్లి, నాగపూర్ గ్రామాల ప్రత్యేక అధికారిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ రెడ్డి, చౌట్ పల్లి, అమీర్ నగర్ గ్రామాల ప్రత్యేక అధికారిగా తహసిల్దార్ ఆంజనేయులు, ఉప్లూర్ పంచాయతీ ప్రత్యేక అధికారిగా డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్, హాసకొత్తూర్ పంచాయతీ ప్రత్యేక అధికారిగా మండల విద్యాధికారి ఆంధ్రయ్య, బషీరాబాద్ పంచాయతీ ప్రత్యేక అధికారిగా మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ మైలారం గంగాధర్, కొన సముందర్, ఇనాయత్ నగర్ గ్రామాల ప్రత్యేక అధికారిగా మండల పంచాయతీ అధికారి సదాశివ్, దొమ్మరి చౌడు తండా ప్రత్యేక అధికారిగా ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ అమీర్ ఖాన్, కోనాపూర్ పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఇరిగేషన్ ఏఈ ప్రీతం శేఖర్, కొత్తచెరువు తండా పంచాయతీ ప్రత్యేక అధికారిగా మిషన్ భగీరథ ఏఈ శ్రావణ్ కుమార్, రాజరాజేశ్వరి నగర్ పంచాయతీ ప్రత్యేక అధికారిగా పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, నర్సాపూర్ పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంఎస్ఓ రమేష్ బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ ప్రత్యేక అధికారులను పంచాయతీ కార్యదర్శులు శాలువాలతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక అధికారులు గ్రామస్థాయి అధికారులు, సిబ్బందితో పరిచయ సమావేశాలను ఏర్పాటు చేసుకొని ముచ్చటించారు. వారి నుండి గ్రామాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.


ప్రత్యేకాధాకిరిని సన్మానిస్తున్న పలువురు


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా ఇన్‌ఛార్జి ఎంపీడీవో బ్రహ్మానందం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్లను శాలువాతో సన్మానించారు. శుక్రవారం ఉదయం ఇంచార్జ్ ఎంపీడీవో బ్రహ్మానందం మాజీ సర్పంచ్ ద్వారా బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గంగారెడ్డి, మరియా సతీష్, మండల కో ఆప్షన్ నెంబర్ బుల్లెట్ అక్బర్ ఖన్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

మండలంలోని మునిపెల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్గా ఎంపీవో యూసుఫ్‌ఖాన్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని చింతలూరు గ్రామ స్పెషల్ ఆఫీసర్గా మండల పశువైద్యాధికారి శిరీష బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శి, గ్రామస్థాయి అధికారులు శాలువతో ఘనంగా సన్మానించారు.

డిచ్‌పల్లి: గ్రామాల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. డిచ్‌పల్లి, ఇందల్ వాయి ఎంపీడీవోలు టీవీఎస్ గోపి బాబు, రాములు నాయక్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకునే బాధ్యత ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులపై ఉందని అన్నారు. తాగునీటి వసతులు, వీధి దీపాలు, పరిశుభ్రత ఎప్పటికప్పుడు చేయించాలన్నారు. గ్రామ పంచాయతీకి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చూడాలని సూచించారు. గ్రామాల్లో కేటాయించిన ప్రత్యేకాధికారులు విధుల్లో చేరినట్లు వారు తెలిపారు.


మాట్లాడుతున్న అధికారి


ప్రత్యేకాధికారిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

ఏర్గట్ల: గ్రామాల్లో సర్పంచుల పాలన ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులుగా వివిధ శాఖలకు చెందిన అధికారుల నియమించింది. ఇందులో భాగంగా ఏర్గట్ల, నాగేంద్ర నగర్, బట్టాపూర్ గ్రామాలకు ఎంపీఓ శివ చరణ్‌ను, దోంచంద, తొర్తి గ్రామాలకు ఏఓ అబ్దుల్ మాలిక్, గుమ్మిర్యాల్, తాళ్ల రాంపూర్ గ్రామాలకు ఎమ్మార్వో మహమ్మద్ యూసుఫ్, తడపాకల్ గ్రామానికి పంచాయతీ రాజ్ ఏఈ విక్రమ్‌ను ప్రత్యేకాధికారులుగా నియమించారు. వారు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. వారిని ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని బాడ్సి, సింగంపల్లి గ్రామంలో స్పెషల్ ఆఫీసర్‌గా డిప్యూటీ తహసీల్దార్ మున్నిరుద్దీన్ శుక్రవారం చార్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా మునిరుద్దీన్ మాట్లాడుతూ సర్పంచ్ గ్రామ అభివృద్ధి కోసం ఎలా పాటుపడ్డారో అలాగే తాము ఉన్నన్ని రోజులు కచ్చితంగా గ్రామ అభివృద్ధి కొరకు కృషి చేస్తామని అన్నారు. గ్రామ ప్రజలకు ఏ అవసరం ఉన్నా తనను సంప్రదించవచ్చని తెలిపారు. వేసవి కాలంలో ఎటువంటి తాగునీటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. అందరం కలిసి గ్రామ అభివృద్ధికి పాటుపడదామని ఆయన తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి


విద్యార్థులతో భోజనం చేస్తున్న స్పెషల్ అధికారి

ఆర్మూర్: మండలంలోని చేపూర్ గ్రామ ప్రత్యేక అధికారిగా మండల పశు వైద్యాధికారి లక్కం ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బడి పిల్లలకు అందుతున్న మిడ్ డే మీల్స్, మధ్యాహ్న భోజన పథకం ఎలా అమలు జరుగుతోంది అని తెలుసుకోవడానికి బడికి వెళ్ళి పిల్లలతో కలిసి భోజనం చేశారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీలను సందర్శించారు. వృద్దులకు, వికలాంగులకు అందుతున్న పెన్షన్ల పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ బాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేకాధికారిని సన్మానిస్తున్న కార్యదర్శి, సిబ్బంది

భీంగల్‌రూరల్: గ్రామాల్లో సర్పంచ్, ఉప సర్పంచు పదవీకాలం ముగిసిన సందర్భంగా బదిలీపై గ్రామాల్లోకి స్పెషల్ ఆఫీసర్లు వచ్చారు. తహసీల్దార్ వెంకటరమణ బాచన్ పల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు స్వాగతం పలుకుతూ పంచాయతీ కార్యదర్శి సంజయ్, మాజీ సర్పంచ్ ఆకుల కవిత గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.విజయ్, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.


వెల్గటూర్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సారిక

మెండోర: మండలంలోని పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. మెండోర మండలకేంద్రంలో నెహ్రూ నగర్ కాలనీ గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారిగా శ్రీనివాస్, వెల్గటూర్ గ్రామం, నడిమితండా గ్రామ పంచాయతీల్లో సారిక ప్రత్యేక అధికారినిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారులను గ్రామ సెక్రెటరీలు , పంచాయతీ సిబ్బంది మర్యాదపూర్వకంగా ఆహ్వానిం చారు. ప్రత్యేక అధికారులు సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టి, సంబంధిత రికార్డులను పరిశీ లించారు. అధికారులతో పాటు గ్రామ సెక్రెటరీలు , పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

బాల్కొండ: కేటాయించిన పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు బాధ్యతలు స్వీకరించారు. బాల్కొండకు ఎంపీడీవో సంతోష్ కుమార్, కిసాన్ నగర్ కు తాసిల్దార్ శ్రీధర్, చిట్టాపూర్‌కు ఎంపీపీ కార్యాలయ సూపరిండెంట్ రమణ, వన్నేల్ (బి)కి ఎంపీఓ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్, నాగపూర్‌కు డిప్యూటీ తహసిల్దార్ వినోద్, జలాల్ పూర్ కు నీటిపారుదల శాఖ ఏఈ లింబాద్రి, ఇత్వార్ పేట్‌కు పి ఆర్ ఏఈ షరీఫ్, బోదేపల్లికి మండల వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి, బస్సాపూర్ గ్రామానికి ఆర్‌అండ్‌బి ఏఈ వినీత్ ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టారు.


ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ

ముప్కాల్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సర్పంచుల పదవీ కాలం పూర్తి కావడంతో శుక్రవారం ఆయా శాఖల అధికారులు సర్పంచుల స్థానాలలో ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు.. ఈ సందర్భంగా ముప్కాల్ మండల కేంద్రానికి ఎంపీడీవో దామోదర్ ప్రత్యేక అధికారిగా సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ నుంచి బాధ్యతలను తీసుకున్నారు. వేంపల్లి గ్రామానికి డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్, కొత్తపల్లి తహశీల్దార్ వనజ రాణీ, నల్లూర్, రెంజర్ల గ్రామాలకు ఎంపీవో భరత్ చంద్ర, నాగంపేట్ వ్యవసాయశాఖధికారి రాజ్ కుమార్, వెంచిర్యాల గ్రామానికి ఎంపిడిఓ దామోదర్ బాధ్యతలను స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికి తీర్మానం

- ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టడంతో ఆలస్యంగా ప్రారంభమైన మండల సమావేశం

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ లావణ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామపంచా యతీలకు ప్రత్యేక అధికారులు పదవి బాధ్యతలు చేపట్టడంతో సర్వసభ్య సమావేశం ఆలస్యంగా ప్రారంభించారు. ఈ సమావేశంలో గ్రామాల్లోని సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి తీర్మానం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో 2024-25 సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి చదివి వినిపించారు. అనంతరం పదవీకాలం ముగిసిన సర్పంచులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి శ్రీకాంత్ యాదవ్, జెడ్పీటీసీ దాసరి లావణ్య, ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ శ్రీదర్, వివిధ మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

గ్రామ అభివృద్ధికి సర్పంచ్ కృషి ఎనలేనిది

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామ అభివృద్ధికి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల కృషి ఎనలేనిదని, గ్రామంలో ఏ పని చేసిన ఒక్క రూపాయి అవినీతి చేయకుండా పనులను పూర్తి చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, యువజన నాయకులు క్రాంతి, వినోద్ రెడ్డి, మహేందర్, అరవింద్ గౌడ్, రాకేష్ అన్నారు. శుక్రవారం డిచ్ పల్లి మండలంలోని సుద్ద పల్లి గ్రామంలో సర్పంచ్ పానుగంటి రూపా సతీష్ రెడ్డి, ఉప సర్పంచ్ గంగారాం పాలక వర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుండి నిధులు రాకున్నా సర్పంచ్ పాలకవర్గం ముందుండి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. సొంత డబ్బులతో పనులు చేయించిన సర్పంచ్ రూపా సతీష్ రెడ్డి భవిష్యత్తులో మంచి పదవిలో కొనసాగాలని కోరుకుంటున్నామని వివరించారు. గ్రామంలో సిసి రోడ్లు, మంచినీటి వసతులు, వైకుంఠ ధామం, డంపింగ్ యార్డ్ నిర్మాణం, హరితహారంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ముందుండి చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఎంపీటీసీ ఎంబడి సంతోషం, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు యువజన నాయకులు క్రాంతి, వినోద్ రెడ్డి,మహేందర్, అరవింద్ గౌడ్ ,రాకేష్ ,తదితర యువజన నాయకులు పాల్గొన్నారు.


సర్పంచ్‌ను సన్మానిస్తున్న వీడీసీ, యువజన నాయకులు

విస్తృతంగా వాహనాల తనిఖీ

నవతెలంగాణ -బాల్కొండ

మండల కేంద్రంలో శుక్రవారం ఏఎస్సై శంకర్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు వాహనాలను పరీక్షించి సరైన పత్రాలు లేని వాహనాలకు జరి మానాలు ఆన్లైన్లో విధించారు. వాహనాల పెండింగ్ చాలాన్లను అన్ లైన్ లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్సై శంకర్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వ్యక్తి లైసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని హెచ్చరించారు. ఈ తనిఖీలలో కానిస్టేబుల్స్ లింగన్న, నరేష్ పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలు, మానసిక ఆరోగ్యంపై శిక్షణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహిళా, శిశు దివ్యాంగుల, వయోవృద్దుల శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో పథకంలో భాగంగా జీవన నైపుణ్యాలు, మానసిక ఆరోగ్యం, మార్గదర్శక శిక్షణ కార్యక్రమం డిచ్పల్లి ప్రాజెక్టు పరిధిలోని ఇందల్వాయి కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసినట్లు ఎఆర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ, సైకాలజిస్ట్ కె. సునీత తెలిపారు. ఈ సందర్భంగా జీవన నైపుణ్యాలు, మానసిక ఆరోగ్య పరిస్థితులపై వివిధ యాక్టివిటీస్ ద్వారా వారి స్ట్రెస్ ఎలా కంట్రోల్ చేసుకోవాలో వివరించారు. పరీక్ష సమయంలో నేర్చుకున్న దానిని ఎలా ప్రజెంట్ చేయాలో తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వర్ష, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ శోభ, డీహెచ్ఐడబ్ల్యు జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న, జనరల్ స్పెషలిస్ట్ కవిత, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్స్ లిటరసీ పుష్ప పాల్గొన్నారు.

వెంకటేష్‌గౌడ్‌కు సన్మానం

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన తాళ్ల వెంకటేష్‌గౌడ్ నర్సింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించగా, ఆయనను తాజా మాజీ సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ బాబన్నలు శాలువా కప్పి మెమోంటోలను అందజేశారు. దూపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన టి.వెంకటేష్‌గౌడ్ తమ గ్రామానికి గర్వకారణమని వారు ఈ సందర్భంగా తెలియజేశారు.

ప్రధాన రోడ్డు మరమ్మతులు ప్రారంభం

నవతెలంగాణ-మద్నూర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గురువారం నుంచి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. చాల సంవత్సరాల నుంచి గ్రామ ప్రధాన రోడ్డు కంకర తేలి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు స్పందించి అధ్వాన్నంగా మారిన ప్రధాన రోడ్డు మరమ్మతుల పనులు వెంటనే ప్రారంభించినట్టు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తెలిపారు.


ఎడపల్లి: నూతన బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి


రెంజల్‌లో...


లింగంపేట్‌లో...

ప్రత్యేకాధికారులు అంకితభావంతో పనిచేయాలి

- **ఎడపల్లి ఎంపీడీవో గోపాలకృష్ణ**

నవతెలంగాణ-ఎడపల్లి

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని చేపట్టిందని ఎంపీడీవో గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్‌లో ప్రత్యేక అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. శనివారం నుంచే ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీలలో బాధ్యతలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామపంచాయతీతోపాటు గ్రామాలు అభివృద్ధి పథంలోకి నడవాలంటే ప్రత్యేక అధికారి సమిష్టి కృషితో కలిసిమెలిసి అభివృద్ధికి పాటుపడాలన్నారు. విద్య, వ్యవసాయం, తాగునీటిపై ప్రత్యేక అధికారులతో పాటు కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. సమయపాలన పాటిస్తూ సమస్యలు ఉన్నచోట పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. జవాబుదారీతనంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీవో సుభాష్ చంద్రబోస్, మండల వ్యవసాయశాఖ అధికారి సిద్దిరామేశ్వరరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్‌సింగ్, పశువైద్యశాల అసిస్టెంట్ సర్జన్ ఈ.సందీప్, గ్రామపంచాయతీ యూనియన్ ఎడపల్లి మండల అధ్యక్షులు ఉదయ భాస్కర్, రామిరెడ్డి, స్వర్ణలత, రాహుల్, నాగేష్, రమేష్, శ్రీనివాస్, పద్మావతి, నరేష్, రవి ప్రకాష్‌రెడ్డి, గంగాధర్, రాజేష్, నరసయ్య, ప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం

రెంజల్: మండల కేంద్రమైన రెంజల్ గ్రామపంచాయతీలో మండల ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో శంకర్ శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. బాగేపల్లి, కూనెపల్లి ప్రత్యేక అధికారిగా సూపరింటెండెంట్ శ్రీనివాస్, దండిగుట్ట, దూపల్లి గ్రామాలకు వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, బోర్గం, కళ్యాపూర్ గ్రామాలకు నీటిపారుదల శాఖ ఏఈ భుజేందర్, సాటాపూర్, వీరన్నగుట్ట తండా, ఎంపీఓ గౌస్ మొయినుద్దీన్, కందకుర్తి, మౌలాలి తాండ, తహసీల్దార్ టి.రామచందర్, నీలా, పేపర్‌మిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ముని నాయక్, కిసాన్ తాండ, పశువైద్య అధికారి విట్టల్, తాడుబిలోలి, వీరన్నగుట్ట, ఏఈ (పిఆర్) వినయ్ కుమార్, బాధ్యతలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు.

ప్రత్యేకాధికారులకు సన్మానం

లింగంపేట్: సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో శుక్రవారం నుంచి గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. అందుకుగానూ.. మండలంలోని 41 గ్రామపంచాయతీ పరిధిలో గ్రామపంచాయతీ అధికారులను నియమిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఆదేశానుసారం శుక్రవారం ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీలకు వెళ్లి బాధ్యతలు చేపట్టారు. మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో తాజా మాజీ సర్పంచ్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు


కోటగిరి : బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారి

కోటగిరి: మండలంలో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామపంచాయతీ అధికారులుగా పలువురు అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కోటగిరి ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎత్తొండ, యాద్గార్‌పూర్, ఏక్లాస్‌పూర్ ప్రత్యేక అధికారిగా తాసిల్దార్ ప్రభాకర్ తదితరులు శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. వారికి గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది స్వాగతం పలికారు.

ఉపాధి కూలీలకు స్వీట్లు పంపిణీ


కూలీలకు స్వీట్లు పంచుతున్న అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ ఉపాధిహామీ చట్టం 19వ ఆవిర్భావ దినోత్సవం సందర్భగా ఉపాధిహామీ కూలీలకు మద్నూర్ మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ బండి వార్ విజయ్, పంచాయతీ కార్యదర్శి సందీప్ స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ప్రోగ్రాం అధికారి పద్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

జీపీలలో బాధ్యతగా పని చేయాలి


పెద్దఎడ్గిలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దఎడ్గి గ్రామంలోని పంచాయతి సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. శుక్రవారం మండలంలోని 30జీపీలలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకోవడం జరిగింది. అందులో భాగంగా పెద్ద జీపీలో సర్పంచ్ వినోద్, ఉపసర్పంచ్ ఖండేరావ్, జీపీ పాలకవర్గంలకు గ్రామ పంచాయతి కార్యదర్శి కాంబ్లే నాగయ్య అధ్యక్షత వహించి ప్రతి ఒక్కరికి ఘణంగా సన్మానించారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ గంగా సాగర్‌ను శాలువా పుష్పగుచ్ఛం జేపిఎస్ నాగయ్య ఇచ్చి సన్మానించి ఆహ్వానించారు. అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ప్రత్యేకారికి, జేపిఎస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్‌లు పాలకవర్గం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వానికే ఆదర్శం వివేకానందుడు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానందుడని, విశ్వానికే ఆదర్శం వివేకానందుని బోధనలని ప్రముఖ వక్త ఎస్ఎన్ చారి అన్నారు. శుక్ర వారం వివేకానంద స్వామి జయంతి ఉత్సవాలు శివాజీనగర్ రామకృష్ణ విద్యానికేతనంలో అంగరంగ వైభవంగా జరిగాయి . ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఉప న్యాస పోటీల్లో పాల్గొన్న యువతి యువకులకు వివేకానంద పుస్తక సాహిత్యం నగదు బహుమతులు అందజేశారు. ఎస్ఎన్ చారి మాట్లాడూ 150 ఏళ్ల తర్వాత కూడ స్వామీజీ దేశ భక్తి మనకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. విశ్వమత మహాసభల్లో అమెరికా సోదర సోదరీమణుల్లారా అని సంభోదించి వసుదైక కుటుంబాన్ని స్థాపించారని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది కృష్ణ యాదవ్, యోగ రామచంద్రం, సంఘ సేవకుడు ప్రమోద్, వేద పండితులు జనగామ చంద్రశేఖర శర్మ , శ్రీనివాస చారి శశిరేఖ, మాధురి మధుసూధన చారి విద్యార్థుల తల్లిదండ్రులు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు .

అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె నోటీసు అందజేత

నవతెలంగాణ-వర్ని

ఫిబ్రవరి 16న కార్మిక సంఘాలు తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్ సమ్మెను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ ఉద్యోగులు పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మోస్రా తహసీల్దార్ సాయిలుకు సమ్మె నోటీసు అందజేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ, జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా అంగన్‌వాడీ ఉద్యోగులందరూ పాల్గొంటారని నోటీసులో పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం మహిళా ఉద్యోగుల పట్ల మొండిగా వ్యవహరిస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నన్నేసాబ్, యూనియన్ నాయకులు కరుణాదేవి, మీనా, పుష్ప, సుమలత, తదితరులు ఉన్నారు.

గాంధారి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ జానకి


బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారిణి

నవతెలంగాణ-గాంధారి

గాంధారి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ జానకి నియమితులయ్యారు. ఆమె శుక్రవారం గాంధారి మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వికలాంగులకు ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరి

నవతెలంగాణ-పిట్లం



వికలాంగ విద్యార్థులకు క్రమం తప్పకుండా వ్యాయామం నిర్వహించాలని ఫిజియోథెరపీ డాక్టర్ విశాలాక్షి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భవిత సెంటర్లో విద్యానభ్యసిస్తున్న 8 మంది వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వికలాంగ విద్యార్థులకు వారి తల్లిదండ్రులు ఇంటి వద్ద చిన్నచిన్న వ్యాయామ ఆసనాలను చేయించినట్లయితే వారి అవయవలోపము క్రమేపి తగ్గుదల ఉంటుందని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల్ కిషోర్, సిబ్బంది గంగాధర్ పాల్గొన్నారు.

వికలాంగులకు ఫిజియోథెరపీ

నిజాంసాగర్ : మండల విద్యా వనరుల కేంద్రంలో డాక్టర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో 8 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా వారి తల్లిదండ్రులకు అవసరమైన వ్యాయామాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజు, ఐఈఆర్‌పీఎస్ చిన్న సాయిలు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


వికలాంగులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు

పీహెచ్‌సీలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం స్వస్తవ క్యాన్సర్ కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 30 సంవత్సరాలు దాటిన మహిళలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థ ద్వారా 170 మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ పరీక్షలు చేయడం జరిగిందని తెలిపారు. ఆరోగ్యం విషయంలో మహిళలు జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించి, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ అధికారులు యేమిమా, ఆదర్శ్, హెచ్ఈవో వెంకట రమణ, స్టాఫ్‌నర్స్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుంటి తండా పాఠశాలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్

నవతెలంగాణ-మాచారెడ్డి



మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ గుంటి తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయనకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ నాయక్ శాలువాతో సన్మానించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కృష్ణ రాము, ఎస్ఎంసి సభ్యులు మదన్ విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివ ప్రసాద్, కంచర్ల ఎంపిటిసి మోహన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



డాల్ఫిన్ బేకరీలో అధికారుల తనిఖీలు

- **కేసు నమోదు చేసిన సివిల్ సప్లై అధికారులు**
- **నవతెలంగాణ వార్తాకు స్పందన**

నవతెలంగాణ ఆర్మూర్

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న పట్టణంలోని లోని డాల్ఫిన్ బెంగళూరు బేకరీని మూడు శాఖల అధికారులు తనిఖీ చేశారు. బేకరీలో గృహ వినియోగానికి ఉపయోగించిన గ్యాస్ సిలిండర్లు పట్టుబడడంతో సివిల్ సప్లై అధికారులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని బాలాజీ పెట్రోల్ పంపు ఎదురుగానున్న డాల్ఫిన్ బెంగళూరు బేకరీ లో కుళ్ళిన కేకులు విక్రయిస్తున్నారని బేకరీలో కుళ్ళిన కేకులు శీర్షికన వార్త ప్రచురితమైంది . దీంతో వివిధ శాఖలకు చెందిన అధికారులు స్పందించి శుక్రవారం తనిఖీలు చేశారు.


బేకరీని తనిఖీ చేస్తున్న అధికారి

డాల్ఫిన్ బేకరీని అగ్నిమాపక అధికారి మధుసూదన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండంతస్తుల దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన పరికరాలు లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే బాధ్యులు ఎవరని దుకాణ యజమానిని నిలదీశారు. బేకరీలో అగ్నిమాపక పరికరాలు అమర్చాలని లేనట్లయితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆ తర్వాత ఆర్మూర్ సివిల్ సప్లై నాయబ్ తాసిల్దార్ వినోద్ కుమార్, శ్రీనివాస్‌లు బేకరీ దుకాణంలోని వంటగదిని పరిశీలించగా గృహ వినియోగానికి సంబంధించిన నాలుగు గ్యాస్ సిలిండర్లు పట్టుబడ్డాయి. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి కేసు నమోదు చేశారు. గృహానికి వినియోగించవలసిన సిలిండర్లు బేకరీలోని దుకాణంలో అక్రమంగా వినియోగిస్తున్నందున కేసు నమోదు చేశామని అధికారులు వివరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న బేకరీ దుకాణాన్ని మండల రెవెన్యూ ఇన్స్ స్పెక్టర్ అశోక్ సింగ్ పరిశీలించారు. బేకరీలో ఆహార పదార్థాల తయారీ అధ్వానంగా ఉండడం పట్ల దుకాణంలో పనిచేస్తున్న వారిని పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు.

IN THE COURT OF THE HONORABLE PRL. JUNIOR CIVIL JUDGE AT NIZAMABAD
EP No 354/2023
in
O.S.No. 246 of 2022

Between:-
Lalitha Pawar
Decree Holder
And
Bachu Narender
Judgment Debtor

To
Bachu Narender s/o Bachu Laxminarayana, aged 38 years, occu; Advocate, R/o H.No.1-5-10, Phulong, Near Gole Hanuman, Nizamabad

Take notice that the above named Decree holder has filed the above Execution petition for execution of decree in O.S.No.246/2022, against you. Several times notices sent to you returned un-served.

Now the case is posted on 15-02-2024 at 10-30 A.M. for your appearance. You are hereby required to appear before the court either in person or through a pleader failing which the matter will be decided in your absence.

//By order of the court//
M.SUDERSHAN REDDY
Advocate Nizamabad

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE AT NIZAMABAD
I.A. No 130 of 2024
in
O.S. No. 48 of 2023

Between:
Bhosle Shivaji
Plaintiff
And
Bachu Narender
Defendant

To
Bachu Narender s/o Bachu Laxminarayana, aged 38 years, occu; Advocate, R/o H.No.1-5-10, Phulong, Near Gole Hanuman, Nizamabad

Take notice that the above named plaintiff filed the above suit for recovery of amount against you. Several times summons sent to you returned un-served. The plaintiff filed I.A.No. 130/2024 for substitute service of summons and the same was allowed on 10-1-2024.

Now the case is posted on 15-02-2024 at 10-30 A.M. for your appearance. You are hereby required to appear before the court either in person or through a pleader failing which the matter will be deiced in your absence.

//By order of the court//
M.SUDERSHAN REDDY
Advocate, Nizamabad